కాల్చకుండానే పేలుతున్నాయ్!

- బాణసంచా ధరలకు రెక్కలు
- 20 నుంచి 40 శాతం మేర పెరుగుదల
- ప్రతికూల వాతావరణంతో వ్యాపారుల్లో ఆందోళన

నిడదవోలు రూరల్/చాగల్లు/పెరవలి: జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ దివ్య దీపావళి. చీకటిని పారదోలి వెలుగులు నింపే పండగగా, విజయానికి ప్రతీకగా దీపావళిని ఏటా ఆశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకోవడం ఆనవాయితీ. చిన్నా, పెద్దా తేడా లేకుండా టపాసులు కాల్చేందుకు సిద్ధమవుతారు. ఈ ఏడాది టపాసులు ధరల రూపంలో ముందే పేలుతున్నాయి. గతేడాదితో పోలిస్తే 20 నుంచి 40 శాతం మేర పెరిగి వినియోగదారులను బేజారెత్తిస్తున్నాయి. ముడి సరకుల ధరల పెరుగుదల, స్థానికంగా తయారీ తగ్గిపోవడం ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ప్రతికూల వాతావరణం, ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలో వ్యాపారులు ఉన్నారు. అగ్గిపెట్టెలు, తారాజువ్వలు, మతాబులు, భూచక్రాలు, థౌజండ్ వాలాలు తదితర వంటివి వాటి కంపెనీలను బట్టి ధరలు పెంచారు. దీంతో ఆదివారం అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

నిబంధనల పేరుతో మామూళ్ల వసూళ్లు!

నిడదవోలు పట్టణ, మండల పరిధిలో 22 దుకాణాలు, చాగల్లు మండలంలో ఏడు దుకాణాలకు అధికారులు అనుమతులిచ్చారు. నిడదవోలు మండలంలో కూటమి నేతలతో పాటు అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ అధికారులు నిబంధనల పేరుతో మామూళ్లు వసూలు చేస్తున్నారని సమాచారం. ఫలితంగా వ్యాపారులు ఆ డబ్బు లోటు పూడ్చుకునేందుకు సిండికేట్‌గా మారిపోయారు. టపాసుల ధరలు అమాంతం పెంచి ప్రజల నెత్తిమీద రుద్దేస్తున్నారని కొనుగోలుదారులు అంటున్నారు. బాణసంచా ధరలు ఇష్టారాజ్యంగా పెంచి అమ్మినా అడిగే అధికారులు కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.


నిడదవోలులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు


చాగల్లులో బాణసంచా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


పెరవలిలో వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

ఆందోళనలో వ్యాపారులు

దీపావళి వచ్చిందంటేనే గ్రామాల్లో సందడి ఉంటుంది. కానీ ఈసారి పంట చేతికందక రైతులు, పనులు లేక కూలీలు ఇబ్బందులు పడటంతో బాణసంచాను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. సాధారణంగా నవంబర్ మొదటి రెండు వారాల్లో దీపావళి రావడం అదే సమయానికి ఖరీఫ్ కోతలు, మాసూళ్లు ముమ్మరంగా ఉండేవి. రైతులు, కూలీల వద్ద డబ్బులు ఉండటం, ఉద్యోగులకు జీతాలు రావడం వల్ల బాణసంచా విక్రయాలు ఆశాజనకంగా ఉండేవి. అయితే ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ ఏడాది అక్టోబర్ మూడో వారంలో దీపావళి రాగా.. ఖరీఫ్ కోతలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. రెండు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. దీపావళికి బాణసంచా అమ్మకాలు జోరుగా ఉంటాయని ఆశించి దుకాణాలు వేసిన యజమానులు ఏ ఒక్కరూ కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో దుకాణాల వద్ద ఉసూరుమంటూ కూర్చుంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి కొనుగోలు చేసిన సరకులు అమ్మకాలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సగం సరుకుపైగా అమ్మకాలు జరిగేవని నేడు పదిశాతం కూడా సరుకు అమ్మకాలు జరగలేదని చెబుతున్నారు.

మండలంలో బాణసంచా ధరలు (రూ.) ఇలా

బాణసంచా	గతేడాది	ఈఏడాది సుమారు
అగ్గిపెట్టెలు(10 బాక్సులు)	550	750
కాకర పువ్వొత్తులు(10 బాక్సులు)	600	750
విష్ణు చక్రాల(10)	100	80
చిచ్చుబుడ్లు (12)	180	260
జువ్వలు(10)	250	350
భూచక్రాలు(10)	100	180
టపాకాయలు(25)	25	40
పేలుడు జువ్వ(100)	1000	1600
డిస్కో చిచ్చుబుడ్లు(12)	260	380

తాళ్లపూడి: బాణసంచా ధరలు గతంలో కంటే పెరగడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు కొనుగోలు చేయడానికి భయపడుతున్నారు. పండగకు పిల్లలకు టపాసులు కొనడం గగనంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1,500, రూ.2 వేలు తీసుకెళ్లిన సరిపడా సామాగ్రి రావడంలేదు. తాళ్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ఏడు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. తాళ్లపూడిలో 7, మలకపల్లిలో 1 దుకాణాలకు అనుమతి ఇచ్చినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

కొవ్వూరు: పట్టణంలో సంస్కృత పాఠశాల వద్ద 7 బాణ సంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. మండలంలోని పంగిడి రోడ్డులో పెద్ద సంఖ్యలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు.

అనుమతులు లేకుండా విక్రయిస్తే కేసులు



పెద్దవాళ్ల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణసంచా కాల్చడం ఉత్తమం. టపాసులు కాల్చేటప్పుడు నీళ్ల దగ్గర పెట్టుకోవాలి. ఇంటి కిటికీలు, తలుపులు మూసివేయాలి. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలి. దీపావళి పండుగ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలాగే ఏ విధమైన అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.
– కె.నరేంద్ర, ఎస్సై, చాగల్లు.

బాణసంచా కొనలేకపోతున్నాం



పెరిగిన ధరలతో బాణసంచా కొనలేకపోతున్నాం. గతేడాది కంటే 20 నుంచి 40 శాతం ధరలు పెరగడంతో రూ.1000కి చిన్న సంచి సామాగ్రి కూడా రావడం లేదు. రైతులకు, కూలీలకు పనులు లేకపోవడంతో పల్లెల్లో దీపావళి వెలుగులు లేవు. కొన్ని షాపుల్లో బాణసంచా అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
– కొయ్యే నరేష్‌బాబు, అట్లపాడు.

క్లుప్తంగా

ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,20,040 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ


కంసాలిపాలెంలో వెంకటేష్‌ను పరామర్శిస్తున్న పల్లారావు, నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉప్పాటి వెంకటేష్ ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు స్టంట్ వేయించుకొని కోలుకోవడంతో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ శ్రేణులు ఆదివారం పరామర్శించారు. సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు బెజవాడ గంగాధరరావు, నాయకులు తాతారావు, పెనుమాక రాజు, నక్కా సూరిబాబు, పి.సత్యనారాయణ ఆయన వెంట ఉన్నారు.

సేవారథం ప్రారంభం


గొల్లగూడెం వృద్ధాశ్రమంలో సేవారథాన్ని ప్రారంభిస్తున్న రామలక్ష్మమ్మ

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద ఉన్న లగడపాటి రామలక్ష్మమ్మ రమానాయుడు దివ్యాంగుల, వృద్ధాశ్రమాన్ని గౌరవాధ్యక్షురాలు లగడపాటి రామలక్ష్మమ్మ ఆదివారం సందర్శించారు. ఆశ్రమంలోని దివ్యాంగుల ఆశ్రమం, సర్జికల్, ఆర్టిఫిషియల్ లింబ్స్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. దాతల సహకారంతో రూ.6 లక్షల వ్యయంతో ఆశ్రమంలో ఏర్పాటు చేసిన సేవారథాన్ని ఆమె ప్రారంభించారు. ఆశ్రమానికి రూ.25 వేలు విరాళంగా ఆశ్రమ వ్యవస్థాపక చైర్మన్ కాగిత భాస్కరరావుకు అందజేశారు.

పోరాటంలో బాధ్యతలు మర్చిపోవద్దు

దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్


కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దళితసేన నాయకులు

నల్లజర్ల: జిల్లాలో ఉన్న దళిత సోదరులంతా తమ హక్కులు, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి పాటుపడుతూ అంబేడ్కర్, పూలే, జగజ్జీవన్ రామ్ ఆశయాల కోసం పని చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జు వరపు రవిప్రకాష్ సూచించారు. ఆదివారం నల్లజర్లలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవిప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎంపికైన దిరిసి పాము కృష్ణమూర్తిని కార్యకర్తలు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పెంటపాడు, నల్లజర్ల మండల దళితసేన అధ్యక్షులు చదలవాడ శ్రీనివాసరావు, దొండపాటి సువర్ణరాజు, మండల ప్రధాన కార్యదర్శి తాడిగడప నిరీష్, గ్రామ అధ్యక్షుడు పెనుమాక వీరాస్వామి, దళితసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం.. సేవే ప్రధానం

- పేదల వైద్యుడు సూర్యచంద్రరావు
- రూపాయి తీసుకోకుండా వైద్యం
- ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

నల్లజర్ల: వయసు పెరిగినా అన్నం పెట్టిన వృత్తిని వదలకుండా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు పీఎంపీ వైద్యుడు డాక్టర్ అల్లూరి సూర్యచంద్రరావు (81). 2021లో పుల్లలపాడు సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నికయ్యారు. గతంలో ఇదే గ్రామంలో వైఎస్సార్ సీపీ హయాంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ఎంపికయ్యారు. వైద్య విధాన పరిషత్ ద్వారా శిక్షణ పూర్తి చేసిన ఆయన తొలుత దూబచర్ల ఆయుర్వేద డిస్పెన్సరీలో 25 ఏళ్లపాటు వైద్య సేవలు అందించారు. అప్పట్లో ఆయనకు నెలకు రూ.200 జీతం వచ్చేది. అది ఆయన పదవీ విరమణ సమయానికి రూ.2 వేలకు పెరిగింది. ఆ పార్ట్ టైమ్ ఉద్యోగానికి ఎటువంటి పెన్షన్ సౌకర్యం లేదు. ఇదే ఉద్యోగం కోసం ఎంబీబీఎస్ స్థాయి వ్యక్తులు కూడా పోటీ పడ్డారు. 2001లో పదవీ విరమణ తర్వాత నల్లజర్లలో డాక్టర్ నల్లూరి వెంకటపతి వద్ద ఇంగ్లీషు వైద్యంలో తర్ఫీదు పొందారు. అర్ధ రాత్రి వచ్చి ఎవరు ఇంటి తలుపు తట్టినా వచ్చి నేటికీ వైద్యం అందిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి పెద్ద వైద్యుల దగ్గరకు పంపిస్తుంటారు. పాము కాటు, పాయిజన్ కేసులు ఆయన దగ్గరకు వస్తుంటాయి. ఆయన దగ్గరకు వెళ్తే రోగి క్షేమమని స్థానికులు చెబుతుంటారు. పెద్ద డాక్టర్లు సైతం నయం చేయలేని జబ్బునైనా తన అనుభవంతో నయం చేస్తుంటారు. దాదాపు 30 గ్రామాల నుంచి ప్రజలు వచ్చి వైద్య సేవలు అందుకుంటున్నట్టు ఆయన చెప్పారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, లైఫ్‌స్టైల్ నేపథ్యంలో ప్రతిరోజు కనీసం గంట సేపు వ్యాయామం చేయాలని, అప్పుడే కొన్ని ఆరోగ్య సమస్యలనుంచైనా విముక్తి లభిస్తుందని రోగులకు ఆయన చెబుతున్నారు.


పుల్లలపాడులో ఇంటి వద్దే ప్రజలకు వైద్యం చేస్తున్న డాక్టర్ సూర్యచంద్రరావు

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు


పశివేదలలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ రచ్చబండలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు


గుండేపల్లిలో కోటి సంతకాల సేకరణ,'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'లో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

తాళ్లపూడి: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలకే పేరు మార్చి ఉల్టా కొట్టించి పరిపాలన సాగిస్తూ ప్రజలను మోసాగిస్తున్నారని నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పశివేదలలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ, అమలు చేసే కొన్ని హామీలను కూడా తూతూమంత్రగా అమలు చేస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎవరైనా అడిగితే వారి నాలుక మందం అంటున్నారని మండిపడ్డారు. సచివాలయ వ్యవస్థను, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని, వలంటీర్లను తొలగించారని, కూటమి ప్రభుత్వ లోపాలను ప్రజలందరికీ తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబు మోసం చేసినట్లే కదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు, రాష్ట్ర ఇంటలెక్చ్యువల్ కార్యదర్శి బండి అబ్బులు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి సుంకర సత్యనారాయణ, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, పార్టీ ముఖ్య నాయకులు ముప్పిడి విజయరాం, ముదునూరి నాగరాజు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలను దోచుకోవడానికే చంద్రబాబు కుట్రలు

నల్లజర్ల: ప్రజల సొమ్ము దోచుకోవడానికే చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం రాత్రి గుండేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ, రచ్చబండ, కోటి సంతకాల కార్యక్రమం ఆ గ్రామ ఎంపీటీసీ జంగా లక్ష్మీశ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉన్నమట్ల రాంబాబు అధ్యక్షతన జరిగింది. వెల్లంకి మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో చెప్పుకోదగ్గ శాశ్వత పథకం ఒక్కటీ లేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలే నేడు చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. గ్రామస్తుల నుంచి కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, మేణ్ణి యువరాజు, గోపాలపురం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కా పండు, చెల్లారి రామ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఈదరాడ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

తాడిపూడి ఉప కాలువకు గండి

- కొట్టుకుపోయిన 15 ఎకరాల పొగాకు తోట
- సుమారు రూ.3 లక్షల నష్టం

గోపాలపురం: తాడిపూడి ఉప కాలువకు గండి పడి సుమారు 15 ఎకరాల పొగాకు పంట కొట్టుకుపోయింది. శనివారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి గోపాలపురం నుంచి గొల్లగూడెం వెళ్లే తాడిపూడి ఉప కాలువకు గండి పడటంతో వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇటీవల నాట్లు వేసిన పొగాకు తోట కొట్టుకుపోయిందని రైతు దుగ్గిరాల బ్రహ్మానందం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం కాలువ గట్టుకు మట్టివేసి నిలుపుదల చేసినట్లు రైతు తెలిపారు. తాడిపూడి కాలువ గట్టు బలహీనంగా ఉందని సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అధిక వర్షానికి సుమారు రూ.3 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొన్నారు. కాలువ పూడికతీత తీయాలని, ఉపకాలువకు సబ్ కాలువలు తీయకపోవడంతో భారీ వర్షానికి గండి పడిందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ గట్టు పటిష్ఠ పరిచి నష్టపరిహారం ఇప్పించాలని రైతు కోరారు.


తాడిపూడి ఉప కాలువకు గండిపడిన చోటును చూపిస్తున్న రైతు

వైభవంగా గణపతి హోమం

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడిలో మన పీఠం వద్ద అయ్యప్ప మాలధారులు ఆదివారం ఉదయం గణపతి హోమం, రాత్రి కలశ పూజ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కలశ పూజలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసం నేపథ్యంలో గోదావరి పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఆదివారం పుష్కర ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, భక్తుల రద్దీకి తగినట్లు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. లైటింగ్, సీసీ కెమెరాలు, తాగునీరు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, లాకర్లను పరిశీలించారు. పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంతో పాటు, స్విమ్మర్లను, పడవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఘాట్ వెంబడి ఒడ్డున ఇసుక వేయించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

బాణసంచా షాపుల వద్ద భద్రతల పరిశీలన


బాణసంచా దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న మార్టిన్ లూథర్ కింగ్

తాళ్లపూడి (కొవ్వూరు): అగ్ని ప్రమాదాలను నివారించడానికి షాపుల్లో తగినంత ఇసుక, మట్టి, నీటి బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు సిద్ధంగా ఉంచాలని జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్ సూచించారు. దీపావళి సందర్భంగా కొవ్వూరులో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా తాత్కాలిక లైసెన్స్ షాపులను ఆదివారం అక్కడ భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించి, షాపుల నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. బాణసంచా షాపుల్లో ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును పరీక్షించారు. అలాగే అగ్నిమాపక సిబ్బందితో కలిసి భద్రతా ప్రమాణాలు, అగ్ని నిరోధక చర్యలు, షాపుల మధ్య దూరం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు, విక్రేతలు సురక్షిత దూరం పాటిస్తూ, అగ్నిమాపక శాఖ సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు. దీపావళి సందర్భంగా ప్రజల భద్రతను కాపాడటానికి అగ్నిమాపక శాఖ పూర్తి సన్నద్ధతతో ఉందని తెలిపారు.

వెంకట్రావు పరామర్శ


కొయ్యే వంశీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరుకు చెందిన కొయ్యే శ్యామలరావు కుమారుడు వంశీకృష్ణ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను తలారి వెంకట్రావు పరామర్శించారు.

23 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

నిడదవోలు రూరల్: నియోజకవర్గ పరిధిలోని మహిళలకు ఈనెల 23 నుంచి తన క్యాంపు కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ సహకారంతో జ్యూట్ బ్యాగ్‌లు, కుట్టు తయారీలో ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 93476 51157, 98481 66644 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రతి ఇంటా ఓ పారిశ్రామికవేత్త రావాలి

కలెక్టర్ కీర్తి చేకూరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సమాజంలో ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. ఆదివారం నగరంలోని పందిరి ఫంక్షన్ హాల్‌లో రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్‌లో భాగంగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ కీర్తితో పాటు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జేసీ, జీఎస్టీ జిల్లా నోడల్ అధికారి వై.మేఘా స్వరూప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం ప్రదర్శన కం అమ్మకాల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడియం ప్రాంతంలో పూల వ్యర్థాలతో అగరవత్తుల తయారు చేస్తున్న మహిళా సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వాటి ఉత్పత్తులను దేవాలయాల ద్వారా మార్కెటింగ్ చేయడానికి అవకాశం కల్పించామని వివరించారు. జ్యూట్ బ్యాగ్‌లు, చేనేత వస్త్రాలు, వంట ఉత్పత్తులు తదితర వాటిని ప్రదర్శనలో ఉంచి, విక్రయించే సదుపాయాలు కల్పించామని చెప్పారు. వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, మందులు, మిల్క్ ప్రొడక్ట్స్ తదితర వాటికి జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం.సుధాకర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.